క్లుప్తంగా

బైక్ చోరీ.. కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలో పార్క్ చేసిన బైక్ కనిపించక పోవడంతో శనివారం బైక్ యజమాని కర్నూల్‌కు చెందిన చాకలి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఈనెల 8న పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద బైక్ పార్క్ చేసి పనిమీద పక్కకు వెళ్లగా తిరిగి వచ్చి చూసే సమయానికి బైక్ చూడగా కనబడకపోవడంతో చుట్టుపక్కల ఆరా తీశారు. ఎంత వెతికినా కనబడకపోవడంతో పోలీసులుకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



ధరూరు: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు శనివారం ఎస్ఐ శ్రీహరి అందజేశారు. పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌పోర్టల్ ద్వారా కనిపెట్టి ముగ్గురు బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. దొంగలు, సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కేటీదొడ్డి: మండలంలోని ఈర్లబండ గ్రామంలోని తలెత్తిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. బహిరంగ విసర్జనకు వెళ్లే వారిని మా ఇంటి ముందు తిరగొద్దని ఓ వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు చెప్పడంతో చిన్నపాటి ఘర్షణ తలెత్తింది. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



అలంపూర్: స్నేహితుడి కుటుంబానికి మిత్రులు ఆర్థిక సాయం అందించి ఆదర్శంగా నిలిచారు. పట్టణానికి చెందిన పిండి నాగరాజు అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతిచెందాడు. ఈ నేపథ్యంలో 1991–92వ బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.25,150 ఆర్థిక సాయాన్ని మృతుడి భార్య లావణ్యకు అందజేశారు. కార్యక్రమంలో మధుబాబు, ఏసేపు, టైగర మద్దిలేటి పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన పాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన సుధాకర్ రెడ్డి రూ.50 వేలు విరాళం అందజేశారు. ఆలయంలో కల్యాణ మండప నిర్మాణానికి తమవంతు సాయంగా ఆలయ పెద్దలకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల గ్రామంలో ఏఎస్ఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం ప్రజలకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, బాల్య వివాహాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండ్ల గిరక పోటీలు



గట్టు: మండల పరిధిలోని మిట్టదొడ్డి గ్రామంలో శనివారం ఎద్దుల బండ్ల గిరక పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా మూడు బండ్ల గిరక పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలను కాంగ్రెస్ నాయకురాలు, మాజీ సర్పంచ్ ధనలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో మిట్టదొడ్డి తిరుమల్, అంతంపల్లి ఆంజనేయులు, రాజు, ఆంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

గద్వాలటౌన్/అలంపూర్/ధరూరు/గట్టు: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని అక్బర్‌పేటలోని గణేష్ యూత్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అక్బర్‌పేట నుంచి గాంధీ చౌక్ మీదుగా చౌక్ బజార్ వరకు శోభాయాత్ర సాగింది. కనులపండవగా జరిగిన యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో మహేష్, సురేష్, హేమంత్ కుమార్, రంగ, నాగమయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

✤ ధరూరు మండల కేంద్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్ర, ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్థసారిథి ఆలయం వద్ద నుంచి కండేటి హనుమన్న(ఆంజనేయస్వామి) ఆలయం వరకు ఊరేగింపు చేపట్టారు.

✤ గద్వాల పట్టణంలోని దౌదరపల్లి రోడ్డు మార్గంలో ఉన్న బండబావి ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు



అలంపూర్‌లో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ తదితరులు ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

✤ హనుమాన్ జయంతి సందర్భంగా గట్టులోని గండి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాభిషేకంతో పాటుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంత బజారులోని గండి ఆంజనేయస్వామి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



గట్టులో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



ధరూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగించుకోవాలి

ఎర్రవల్లి: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని తిమ్మాపురంలో ఐకేపీ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17శాతం తేమ వచ్చేలా వడ్లను ఆరబెట్టి రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300లను ప్రభుత్వం మద్దతు ధరగా అందిస్తుందన్నారు. అదే విధంగా సన్నరకాలకు ప్రభుత్వం బోనస్‌గా మరో రూ.500 వరకు అందిస్తుందన్నారు. ముఖ్యంగా వడ్లల్లో తాలు, రాళ్లు, మట్టిపెల్లలు లేకుండా కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రుక్మాందర్‌రెడ్డి, మద్దిలేటి, ఉమాపతి నాయుడు, నర్సింహారెడ్డి, వెంకటన్న, లక్ష్మన్న, సాంబశివుడు రైతులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కేటీదొడ్డి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు అన్నారు. మండల కేంద్రంతో పాటు కొండాపురం తదితర గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సన్నరకాలకు మద్దతు ధర రూ. 2,320తో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్‌తో కలిపి 2,820 చెల్లిస్తుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులే ధాన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఉరుకుంద, టీచర్ గోవిందు, కొండన్న, యుగంధర్, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

గద్వాలటౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘ రాష్ట్ర ప్రతినిధి సంజీవ్ మహారాజ్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ ఆలోచన పండుగ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక రాజీవ్‌మార్గ్ రహదారిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. అంబేడ్కర్ విద్యావేత్తనే కాకుండా విద్యను ప్రచారం చేయడం కోసం ఎంతో కృషి చేశారన్నారు. స్వయం కృషి, ఆత్మవిశ్వాసం, మానవ జీవితానికి ముఖ్యమని అంబేడ్కర్ తన జీవితం ద్వారా తెలియజేశారన్నారు. అంబేడ్కర్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన అంబేడ్కర్ లాంటి మహనీయులను స్మరించుకోవాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అంబేడ్కర్ ఆలోచన పండుగ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మాచర్ల ప్రకాష్, మహేష్, సుధాకర్, సురేష్, మోహన్‌రాజ్, ఏసురాజ్, దాసన్న, విజయ్, మోజేష్, అశోక్, హన్మన్న, ప్రవీణ్, ప్రతాప్, కృష్ణంరాజు, రమేష్, ప్రసాద్, ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు

రాష్ట్రంలో బీజేపీ బలపడుతోంది

శాంతినగర్: రాష్ట్రంలో బీజేపీ బలపడుతోందని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయఢంకా మోగించి అధికారం చేపడుతుందని పార్టీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం వడ్డెపల్లి మండలం తిమ్మాజిపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శశికుమార్, సంజీవరెడ్డి, నరసింహ, వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, కృష్ణ, వెంకటరాములు, రాఘవేంద్ర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అయిజ: గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు నిర్వహించారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో, బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని బింగుదొడ్డి గ్రామంలో నిర్వహించారు. అదే విధంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, లక్ష్మణాచారి, భీమన్న, సతీష్, రవి, జయమ్మ, రేఖ, సరళమ్మ, మహేష్, శివన్న, నాగరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాజిపల్లెలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రామచంద్రారెడ్డి

విద్యార్థులందరూ హాజరయ్యేలా చూడాలి



ధరూరు: పరీక్షలకు విద్యార్థులందరూ హాజరయ్యేలా చూడాలని ఎంఈఓ రవీంద్రబాబు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న ఎస్ఏ- 2 పరీక్షలను పరిశీలించారు. శనివారం మండల పరిధిలోని మార్లబీడు ఉన్నత పాఠశాల, ర్యాలంపాడు యూపీఎస్ పాఠశాలలు సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండల పరిధిలోని గువ్వలదిన్నె తూర్పుతండా, పూజారితండా, తోటతండాలోని ప్రాథమికోన్నత పాఠశాలలను శనివారం మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఏ–2 పరీక్షలు పరిశీలించారు. రికార్డులు, పాఠశాల పరిసరాలు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాపయ్య, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మానవపాడులో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



చిన్నోనిపల్లెలో పోషణ మాసంలో పాల్గొన్న నాయకులు

గట్టు: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. చిన్నోనిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై నిత్యం గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం జయమ్మ, ఆశా వర్కర్ ఈశ్వరమ్మ, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు సుమిత్ర, చిన్నమ్మ గర్భిణులు, బాలింతలకు రక్తహీనత, ఇమ్యూనైజేషన్ గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, కృష్ణవేణి, ఏఎన్ఎంలు దేవమ్మ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసానికి దరఖాస్తుల వెల్లువ

అయిజ: రాజీవ్ యువ వికాసం పథకానికి నమోదు చేసుకునేందుకు సోమవారంతో గడువు ముగుస్తుండడంతో శనివారం దరఖాస్తులు వెల్లువెత్తాయి. శనివారం సెలవు దినంలో కూడా మున్సిపాలిటీలో సిబ్బంది దరఖాస్తులు స్వీకరించారు. సర్వర్ సమస్య తలెత్తడంతో దరఖాస్తు దారులు ఆందోళనకు గురయ్యారు. ఆన్‌లైన్ అప్లికేషన్ ఫాంతోపాటు దరఖాస్తుకు సంబంధించిన ఆధార్ కార్డు, కులం, ఆదాయం, పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, రేషన్ కార్డులకు సంబంధించిన జిరాక్స్‌లు, రెండు పాస్ ఫోటోలు జతచేయాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు దరఖాస్తు దారులకు సూచించారు.

మానవపాడు: ఈనెల 13, 14వ తేదీల్లో ప్రభుత్వ సెలవులు ఉన్నా రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తులు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా స్వీకరిస్తామని ఎంపీడీఓ భాస్కర్ ఒక ప్రకటలో తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



అయిజలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఇటిక్యాల: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథక దరఖాస్తులను సెలవు దినాల్లో కూడా తీసుకోనున్నట్లు ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

సామాజిక పోరాటాలు కొనసాగిద్దాం

అలంపూర్: మహనీయుల స్ఫూర్తితో సామాజిక పోరాటాలు కొనసాగిద్దామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీ. రాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. ఉండవెల్లి మండల కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో కేవీపీఎస్ నాయకుడు నాయకంటి పరుశురాముడు వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎం ఉద్యమాలకు ఆకర్షితుడైన పరుశురాముడు నీతి, నిజాయితో ప్రజల కోసం పని చేశారన్నారు. ప్రజల కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అంకిత భావంతో ప్రజలకు సేవ చేసే నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పరుశురాం భార్య హేమలత, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మద్దిలేటి, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు రాంబాబు, నరసింహ, మహబూబ్ బాష, షేక్షావలి, జయన్న తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమెప్పుడో..?

- కొనుగోలు కేంద్రాలకు చేరుతున్న వరి ధాన్యం
- ప్రారంభం కాని ధాన్యం కొనుగోళ్లు
- స్పష్టతనివ్వని అధికారులు
- గాలివానలతో ఇబ్బంది పడుతున్న రైతులు



ధరూరులోని కొనుగోలు కేంద్రానికి చేరిన వరిధాన్యం

ధరూరు: వరి ధాన్యం కొనుగోళ్ల కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. యాసంగిలో సాగు చేసిన వరి పంట కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా.. నేటికీ కొనుగోళ్లు ప్రారంభించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. నేడు.. రేపు అంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోత కోసిన రైతులు పంట అమ్ముకోలేక నిల్వ ఉంచుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. పండించిన వరి ధాన్యాన్ని ఇప్పటికే చాలా వరకు కేంద్రాలకు తరలించి కొనుగోళ్లు ప్రారంభిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు. గిట్టుబాటు ధరను ముందుగానే ప్రకటించిన ప్రభుత్వం కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభంపై దృష్టి సారించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తరలిస్తున్న రైతులు(ఫైల్)

ఏటా పెరిగిన సాగు..

గద్వాల నియోజకవర్గంలో ఏటా వరిసాగు పెరుగతూ వస్తోంది. ధరూరు మండలంలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా గట్టు, మల్దకల్, కేటీదొడ్డి, గద్వాల మండలాల్లో ప్రతి ఏటా 4000 పైగా ఎకరాల్లో వరిపంట సాగు చేస్తున్నారు. బీడు భూములు సాగులోకి తీసుకొచ్చి పంట పండిస్తున్నా ప్రతి ఏడాది ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.

అకాల వర్షాలతో ఇబ్బందులు..

ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో కోతలు కోసి ఉంచుకున్న వరిధాన్యంతో అవస్థలు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ధరూరు కొనుగోలు కేంద్రం వద్ద గత పది రోజులుగా కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నట్లు వాపోతున్నారు. వారం రోజులుగా నిత్యం గాలితో కూడిన వర్షాలు పడుతుండడంతో ధాన్యాన్ని ఆరబెట్టుకున్న రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతూ ధాన్యం తడవకుండా చూస్తున్నారు. నిత్యం ధాన్యాన్ని ఆరబెట్టడం, సాయంత్రం కాగానే కుప్పచేసుకోవడం, కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్ణాటకలో విక్రయాలు..

నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు కర్ణాటకలోని రాయిచూరు మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నారు. క్వింటాల్‌కు రూ.2000 నుంచి ధాన్యాన్ని బట్టి రూ.2,200 వరకు ధర పలుకుతోంది. దీనికి తోడు రవాణా ఖర్చులు అదనంగా అవుతుండడంతో కోసిన పంటను అటు అమ్మలేక.. ఇటు నిల్వ ఉంచుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. కర్ణాటకకు చెందిన వ్యాపారులు ధరూరు మండలంలోని ఆయా కేంద్రాలను సందర్శిస్తున్నారు.

కాపలా ఉండాల్సి వస్తోంది..



మూడెకరాల్లో వరి పంట సాగు చేశాం. కోత కోసి నాలుగు రోజులవుతోంది. వచ్చిన ధాన్యాన్ని ధరూరులోని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాం. రాత్రింబవళ్లు కాపలా కాయాల్సి వస్తోంది.

- వెంకటేష్, చెన్నారెడ్డిపలి

కొనుగోళ్లు ప్రారంభించాలి..



ఎకరా పొలంలో వరి పంట సాగు చేశాం. నేడు, రేపో కొనుగోళ్లు ప్రారంభిస్తామని అధికారుల చెప్పడంతో ధాన్యాన్ని ధరూరు కేంద్రానికి తీసుకొచ్చాం. అధికారులు త్వరగా కొనుగోళ్లు ప్రారంభించాలి.

-మూకెన్న, ధరూరు

త్వరలో కొనుగోళ్లు చేస్తాం..

మండలంలో వరి ధాన్యం కొనుగోళ్లను త్వరలోనే ప్రారంభిస్తాం. రైతులు పండించిన ప్రతి గింజను కొంటాం. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. తక్కువ ధరకు వరి ధాన్యం విక్రయించొద్దు. స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో మాట్లాడి రెండు మూడు రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకొంటాం.

-శోభారాణి ఏపీఎం, ధరూరు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో సరిత



ఉత్సవాల్లో పాల్గొన్న గొంగళ్ల రంజిత్‌కుమార్

ధరూరు: మండల కేంద్రంలోని కొండేటి ఆంజనేయస్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవం, ధ్వజస్తంభం, నవగ్రహ, వినాయక, లింగ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ బండ్ల లక్ష్మదేవమ్మ, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి దంపతుల సమక్షంలో వేదపండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సరిత ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ వేర్వేరుగా పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకలు డీఆర్ శ్రీధర్, డీఆర్ విజయ్‌కుమార్, రాజారెడ్డి, కిష్టన్న, కర్రెప్ప, కుర్వ శ్రీను, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, కపట్రాల వెంకటరెడ్డి, జంగిలప్ప, నర్సింహులు, వెంకటస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.